


లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు మంజూరు చేయాలి


అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి



బొబ్బిలి మండలంలోని రాముడువలస, తెర్లాం మండలంలోని లోచర్ల వద్ద తోటపల్లి కాలువపై నూతనంగా నిర్మించనున్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశంలో శుక్రవారం ఆయన నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. గొల్లాది వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణానికి, మల్లమ్మపేట, గొల్లపల్లి, పాత బొబ్బిలిలో రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. తెర్లాం ఎంపిడిఒ కార్యాలయ నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు.

మరమ్మతులు చేసేదెప్పుడు?



మడ్డువలస ప్రాజెక్టు

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- మడ్డువలస ప్రాజెక్టు నిర్వహణపై స్పష్టత కరువు
- నీటిమట్టం తగ్గడంతో తాగునీటి పథకానికి ఆటంకం

ప్రజాశక్తి - వంగర

దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 20 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన మడ్డువలస ప్రాజెక్టు ప్రధాన గేట్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రభుత్వం ఆరు నెలల క్రితం రూ.1.60 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయినప్పటికీ నేటికీ మరమ్మతు పనులు ప్రారంభం కాలేదు. కనీసం ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. గేట్లు మరమ్మతులకు గురికావడంతో నిరంతరం లీకులు రూపంలో బయటకు వృథాగా పోతోంది. ఫలితంగా ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గింది. దీంతో ప్రాజెక్టు ఆనుకొని మగ్గూరు వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకానికి నీరు అందకపోవడంతో వంగర మండలంతో పాటు రేగిడి మండలంలో గల కొన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతు పనులు చేపడితే తప్ప లీకులు అరికట్టే పరిస్థితి ఉండదని, నిధులున్నా పనులు ఎందుకు చేయడంలేదని ఆయా గ్రామాల ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టుకు 11 ప్రధాన గేట్లు ఉన్నాయి. ఇందులో సుమారు ఎనిమిది గేట్లు వరకు కూడా రోప్స్, సీల్స్, గేట్లు పెయింటింగ్‌లు పూర్తిగా పాడైపోవడంతో ప్రాజెక్టులో ఉన్న సాగునీరు అంతా దిగువకు వృథాగా పోతోంది. వరదల సమయంలో గేట్లు ఎత్తాలన్నా దించాలన్నా అధికారులకు ఇబ్బందిగా ఉంటుంది. గేట్లును బాగుచేయకపోవడంతో ప్రాజెక్టు తీర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారులు మాత్రం పనులు ప్రారంభించక మీనమేషాలు లెక్కిస్తున్నారు.

40వేల ఎకరాలకు సాగునీరు

ఈ ప్రాజెక్టు నుంచి విజయనగరం జిల్లాలో గల వంగర, రేగిడి, సంతకవిటి మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు, జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లోని సుమారు 40వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు వెళ్తుంది. ఇంత పెద్ద ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ఎప్పుడు ప్రారంభించి ఎప్పటికీ పూర్తి చేసి సాగునీరు అందిస్తారో ఎవరికి తెలియని పరిస్థితి ఉంది.

45 రోజులు సమయం..

మరమ్మత్తు పనులు చేయాలంటే ప్రాజెక్టులో ఉన్న మొత్తం నీటినంతటిని ఖాళీ చేసి పనులు పూర్తి చేసేసరికి 45 రోజులు సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్చి నెల పూర్తి కావస్తుంది. పనులు ప్రారంభించినా మే నెల చివరి వరకు జరిగే అవకాశం ఉంది. ఏప్రిల్, మే నెల్లో ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరిలోనే పనులు ప్రారంభిస్తే ఏప్రిల్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉండేది. ఆరు నెలల క్రితం నిధులు మంజూరైనప్పటికీ మరమ్మత్తు పనులు చేసేందుకు అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని రైతులు మండిపడు తున్నారు. కాగా పనులు త్వరితగతిన ప్రారంభించక పోతే నిధులు కూడా వెనక్కి వెళ్ళిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రాజెక్టు ప్రస్తుత నీటి పరిస్థితి

65 మీటర్ల లెవెల్ నీటిమట్టానికి గాను ప్రాజెక్టులో ప్రస్తుతం 60.68 మీటర్ల నీటిమట్టం ఉంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 219 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కుడి ఎడమ కాలువలతో పాటు ప్రధాన గేట్లు అన్ని మూసివేసినట్లు తెలిపారు.

తాగునీటికి ఆటంకం

మడ్డువలస ప్రాజెక్టులో ఉన్న నీటిని ఎప్పుడూ లేనంతగా కుడి కాలువ ద్వారా ఈ ఏడాది కిందికి విడిచిపెట్టడం, అధిక లీకులు వల్ల ప్రాజెక్టులో ఉన్న నీరు భారీగా తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్టుకు ఆనుకొని మగ్గూరులో ఉన్న రక్షిత మంచినీటి పథకానికి నీరందక వంగర మండలంతోపాటు రేగిడి మండలంలో గల కొన్ని గ్రామాలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా వెళ్లే తాగునీరు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని ప్రాజెక్టు మరమ్మత్తు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రిజర్వాయరులో భారీగా తగ్గిన నీటిమట్టం

పనులు ప్రారంభిస్తాం

మడ్డువలస ప్రాజెక్టు గేట్లు మరమ్మతులకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయి. ఏప్రిల్‌లో పనులు ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్ కూడా ప్రాజెక్టు వద్దకు వచ్చి చూసి వెళ్లారు.

- నర్మదా పట్నాయక్, డిఇ, మడ్డువలస ప్రాజెక్టు

ఆర్నెల్లు ఆలస్యంగా ఆసరా

- మూడో విడతలో 36,463 సంఘాలకు రూ.251.30 కోట్లు
- నేడు ముఖ్యమంత్రి ప్రారంభం
- పది రోజులపాటు సంబరాలు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఆరు నెలల ఆలస్యంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ 'ఆసరా'పై ప్రభుత్వం పది రోజులపాటు సంబరాలు జరపాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.కోట్ల రూపాయలు ఖర్చుచేసేందుకు అవకాశం కల్పించింది. పది రోజులపాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇదే పని. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. 'ఇచ్చిందే ఆలస్యం, ఆపై హడావుడి' అంటూ స్వయం సహాయ సంఘాల సభ్యులు నివ్వెరబోతున్నారు. తాను అధికారంలోకి వస్తే డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానని ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్రలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చాక 2019 ఏప్రిల్ 11నాటికి ఎస్సీ, ఎస్టీ, బిసి సామాజికవర్గాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ బకాయి నగదును నాలుగు విడతల్లో తిరిగి సభ్యుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు. తీరా అమలుకు వచ్చేసరికి ఏడాది పట్టింది. వైఎస్ఆర్ ఆసరా పేరిట ఈ పథకాన్ని 2020 సెప్టెంబర్ 11న ప్రారంభించారు. ఆ ఏడాది 36,434 స్వయం సహాయక సంఘాలకు రూ.250.54కోట్లు అందజేశారు. 2వ దశలో 2021 సెప్టెంబర్‌కు బదులు అక్టోబర్ 7న అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ అర్హులందరికీ నగదు పడేసరికి ఆ నెలాఖరు అయ్యింది. విడతల వారీగా 36,475 స్వయం సహాయ సంఘాల సభ్యులకు 252.28కోట్లు అందింది. 3వ విడత 2022 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో 36,463 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.251.30కోట్లు అందజేయాల్సివుంది. డిసెంబర్ వరకు ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. చివరికి డిసెంబర్ చివరిలో 2023 జనవరిలో జమచేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ తరువాత ఉగాదికి తప్పకుండా ఖాతాల్లో జమ అవుతుందని చెప్పుకొచ్చారు. చిరికి నేడు (మార్చి 25న) ఏలూరు జిల్లా దెందులూరులో సిఎం జగన్మోహన్‌రెడ్డి అట్టాసంగా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇలా ప్రారంభం కాగానే సభ్యుల ఖాతాల్లో నగదు జమ అయ్యేందుకు కూడా అవకాశం లేదు. దీనిపై సుమారు పది రోజుల పాటు మండలాల వారి వైఎస్ఆర్ ఆసరా వేడుకలు నిర్వహిస్తారు. ఇప్పటికే పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 26 నుండి ఏప్రిల్ 5 వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో స్థానిక ఎంపి, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కూడా సూచించినట్లు సమాచారం.

రోజూ కొన్ని గ్రామ సమాఖ్యల పరిధిలో ఈ పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే ఈ రకమైన సమాచారం గ్రామ, వార్డు వాలంటీర్లు, గ్రామ సమాఖ్య సహాయకులు, పట్టణ రిసోర్సు పర్సన్లు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి తెలియజేశారు. మార్చి 18 నుండి 20 వ తేదీ వరకు సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఆయా పొదుపు సంఘాల సభ్యులందరితో సమావేశాలు కూడా నిర్వహించారు మండలం లేదా నియోజవర్గాల వారీగా ఆసరా సంబరాలు పూర్తయితే తప్ప సభ్యుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం లేదు. దీంతో, అసలే ఆలస్యం, ఆపై హడావుడితో కాలక్షేపమా అంటూ పలువురు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ఏప్రిల్ 10 ఆఖరు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఒక ప్రకటనలో సూచించారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సి) ద్వారా 5 నుంచి 6ఏళ్ల వయసు కలిగిన పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, భూమి లేని పేదలు, దివ్యాంగులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన పిల్లలు ఉచిత ప్రవేశాలు పొందవచ్చని సూచించారు. www.cse.ap.gov.in/RTE వెబ్ సైట్ ద్వారా గానీ లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈనెల 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. దీనిపై ఏమైనా సందేహాలున్నా.. సహాయం కావాలన్నా ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ 14417, హెల్ప్ లైన్ నంబర్ 95026 66864లను సంప్రదించవచ్చని సూచించారు.

మన్యంలో మంటలు

ఎస్‌టిలో బోయవాల్మీకుల చేరికపై అసెంబ్లీలో ప్రభుత్వ తీర్మానం ● భగ్గుమంటున్న గిరిజన సంఘాలు

ప్రజాశక్తి-సాలూరు/గుమ్మలక్ష్మీపురం

బిసిలుగా ఉన్న బోయవాల్మీకిలను ఎస్‌టిలో చేరుస్తూ అధికార వైసిపి ప్రభుత్వం తమ రాజకీయ స్వప్రయోజనం కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడంతో మన్యం జిల్లాలో మంటలు రేపింది. శుక్రవారం అసెంబ్లీలో దీనిపై తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడమే కాకుండా కేంద్రానికి పంపనున్నట్లు తెలిపింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన, ఆదివాసీ సంఘాలు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినప్పటి నుంచి గిరిజన ఆదివాసీ సంఘాలు గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. రాష్ట్రంలో 40లక్షలమంది వున్న బోయవాల్మీకిలను ఎస్‌టిల్లో చేరిస్తే ఇప్పటికే వున్న గిరిజన తెగలు తీవ్ర అన్యాయానికి గురవుతాయని సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్యంజిల్లాలో అసలైన గిరిజనులు 3.50లక్షల మంది ఉన్నారు. రాయలసీమలో ఇప్పటికే బిసిలుగా ఉన్న బోయ వాల్మీకులను ఎస్‌టిలో చేరిస్తే అసలైన గిరినులకు అన్యాయం జరుగనుంది.

దీనిపై తమ అసంతృప్తిని ఇప్పటికే పలు సందర్భాల్లో గిరిజన, ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘాల నాయకులు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరకు, సంబంధిత గిరిజన ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించలేని స్థితిలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రి ఉన్నారు. వైసిపికి రాష్ట్రంలో ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలు వున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారంతా తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే గిరిజన రిజర్వేషన్ పేరుతో నకిలీ గిరిజన నాయకులు కొంతమంది అధికార, ప్రతిపక్ష పార్టీలలో కీలకమైన పదవులు అనుభవిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఎపి గిరిజన సంఘం వంటి సంఘాలు పోరాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం బోయవాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ తీర్మానం చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది. తాజా ప్రభుత్వ నిర్ణయం అమలైతే ఎక్కువగా నష్టపోయేది పాడేరు, పార్వతీపురం మన్యం జిల్లా లకు చెందిన గిరిజనులేనని స్పష్టమవుతోంది.

అడకత్తెరలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని మన్యం జిల్లాల్లోని గిరిజనులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి నిర్ణయాన్ని ప్రతిఘటించలేక, స్థానిక గిరిజన సంఘాలను సముదాయించలేక వైసిపి ఎమ్మెల్యేలు అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోయే పరిస్థితి కనిపిస్తోంది. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 6.5శాతం రిజర్వేషన్ అమలవుతోంది. ప్రభుత్వ తాజా నిర్ణయం అమలైతే రాజకీయాల్లో గాని, ఉద్యోగాల్లో గాని బోయవాల్మీకి కులస్తులే ఎక్కువ అవకాశాలు పొందే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో తమ ఉనికినే ప్రశ్నార్థకం చేయనున్న తాజా నిర్ణయాన్ని వ్యతిరేకించాలని గిరిజన సంఘాలు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీపై ఒత్తిడి పెంచనున్నాయి.

26న గిరిజన సంఘాల జెఎసి ఏర్పాటు

గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలతో పాటు బోయవాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై చర్చించేందుకు ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గిరిజన ఆదివాసీ సంఘాలు సమావేశం కానున్నాయి. సంఘాలన్నీ జెఎసిగా ఏర్పడి ప్రభుత్వ నిర్ణయాన్ని ఐక్యంగా వ్యతిరేకించాలని భావిస్తున్నాయి. దీని కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అధికారపార్టీ ఎమ్మెల్యే లు మంత్రులపై ఒత్తిడి పెంచేందుకు రంగం సిద్ధమవుతోంది.

గిరిజనులకు తీవ్ర నష్టం

బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్ అన్నారు. గిరిజన సంక్షేమ, అభివృద్ధి కోసం కేటాయించబడిన చట్టాలు, హక్కులను పూర్తిగా అమలు చేయకపోవడంతో నేటికీ గిరిజనులు వెనుకబాటు జీవనం గడుపుతున్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి సిద్ధపడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సచివాలయాల ద్వారా రోజుకు 10 సేవలు

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-గంట్యాడ



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

సచివాలయాల ద్వారా రోజులో కనీసం 10 సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్య కుమారి సూచి ంచారు. గ్రామాల్లో విద్యుత్ బిల్లులన్నీ సచి వాలయం ద్వారానే చెల్లించేలా చూడాలన్నారు. శుక్రవారం గంట్యాడ మండలం, సిరిపురం గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామంలోని గర్భిణుల నమోదు రిజిస్టర్‌ను తనిఖీ చేసి స్పాట్ ఫీడింగ్ కు ఎంతమంది వస్తున్నారని ఐసిడిఎస్ సిబ్బందిని అడిగారు. సమీపంలో నున్న గర్భిణులను పిలిపించి వారితో మాట్లాడారు. హెచ్‌బి పరీక్షలు, పౌష్టికాహారం, బరువు తదితర ఆరోగ్య విషయాల పై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో అందుతున్న సేవలు, ఆహారం పై ఆరా తీశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికలను పిలిచి మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి అడిగారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ కేస్ట్ సర్టిఫికేట్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని జారీ చేసారని అడిగారు. పూర్తి చేసిన గహాల వివరాలను యాప్ లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. సచివాలయ భవనాన్ని, వెల్నెస్ కేంద్రాన్ని త్వరగా పూర్తి చేయాలని అదేశించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్ఒ డాక్టర్ రమణ కుమారి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శీతల్ వర్మ, తహశీల్దార్ రాఘవ, ఎంపిడిఒ భవాని, సిడిపిఒ ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

మోడీ విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం నాయకుల ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామ్రాజ్యవాదానికి, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని, మతోన్మాదం, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశానికి, రాజ్యాంగానికి, ప్రజలకు ప్రమాదంగా మారిన మోడీ విధానాలను తిప్పి కొడతామని సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. సిపిఎం కేంద్రకమిటీ పిలుపు మేరకు శుక్రవారం విజయనగరం ఎల్‌బిజి నగర్‌లో జరిగిన ప్రతిజ్ఞా కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు పి.రమణమ్మ మాట్లాడారు. అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ శక్తులకు అండగా నిలిచిన మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపు తున్నదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పోరాడాలని పిలుపు నిచ్చారు. బి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి రమణమ్మ పూల మాల వేసి నివాళులర్పించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో స్కీమ్‌వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశా కార్యకర్తలు, ఆర్‌పిలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుని, కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. వీటన్నింటిపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు జె.కామేశ్వరి, ఎండిఎం యూనియన్ అధ్యక్షులు రామలక్ష్మి, ఆర్‌పిల సంఘం అధ్యక్షులు లత, ఆశా యూనియన్ అధ్యక్షులు శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార బాధితులకు న్యాయం జరగాలి

కలెక్టర్ ఎ.సూర్యకుమారి ● విజిలెన్స్ కమిటీ సమావేశంలో సమస్యలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార బాధితులకు న్యాయం జరగాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టం చేశారు. అట్రాసిటీ చట్టం కింద నమోదు చేసిన కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో, విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చించారు. మొత్తం 48 కేసులు నమోదు కాగా, ఆయా డిఎస్‌పిల పరిధిలో ఉన్న కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసుల్లో సమగ్ర విచారణ చేయాలని ఆదేశించారు.

కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, అట్రాసిటీ కేసుల్లో విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు తక్షణ పరిహారాన్ని అందించాలని చెప్పారు. కేసుల్లో బాధితులకు బెదిరింపులు వస్తే, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జాతాపు తెగకు చెందిన కేసుల్లో, బాధితుల బాధ తెలుసుకొనేందుకు, బాషా అనువాదకులను నియమించి, కోర్టుకు పంపించాలని సూచించారు. కేసులు నమోదుకు అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేయాలని సూచించారు.

కమిటీ సభ్యులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీఒక్కరికీ చదువు అవసరమని, ఆడపిల్లలను కూడా కనీసం డిగ్రీ వరకు చదివించేందుకు కృషి చేయాలని కోరారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. చిన్నతనంలోనే వివాహం చేస్తే, వారి శారీరక ఎదుగుదల సక్రమంగా ఉండదని, అలాంటి స్థితిలో గర్భం దాల్చడం ఒక్కోసారి ప్రాణాంతకమవుతుందని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితిలోనూ గర్భిణులు, శిశువులను వైద్యం కోసం ఆర్‌ఎంపి వైద్యులకు చూపించవద్దని కోరారు. దీనివల్ల వ్యాధి ముదిరి తల్లీ, పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు.

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మాట్లాడుతూ ఈ ఏడు నెలల కాలంలో 55 కేసుల్లో సుమారు రూ.1,10,50,000 పరిహారం కింద అందజేసినట్లు తెలిపారు. వీటిలో 44 కేసుల్లో 72 మంది ఎస్‌సిలకు, 11 కేసుల్లో 21 మంది ఎస్‌టిలకు పరిహారాన్ని ఇచ్చినట్లు చెప్పారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.రత్నం, వివిధ శాఖల అధికారులు, డిఎస్‌పిలు, తహశీల్దార్లు, విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

8మంది విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శుక్రవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో చూసి రాతలకు పాల్పడిన 8మందిని డిబారు చేసినట్లు ఆర్‌ఐఒ ఎం.సత్యనారాయణ తలెఇపారు. గుర్ల లో ఇద్దరు, సీతానగరంలో ఇద్దరు, వేపాడలో ఇద్దరు, కొత్తవలసలో ఒకరు, విజయనగరంలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24795 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 23,779 మంది హాజరయ్యారు. 1016 మంది గైర్హాజరయ్యారు. 42పరీక్ష కేంద్రాలను తనిఖీ బృందాలు పరిశీలించాయని ఆర్‌ఐఒ తెలిపారు.

నేడు బిఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సమావేశం

విజయనగరం టౌన్ : టెలికం సలహా కమిటీ సమావేశం ఈనెల 25న బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ భవన్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జె.శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు మర్రి నాయుడు, బివివి నగేష్ , డి.దాలినాయుడు హాజరు కానున్నారు. బిఎస్ఎన్ఎల్ సంస్థ అభివృద్ధి, ప్రజలకు నాణ్యమైన సర్వీసులు అందించేందుకు చేయాల్సిన కృషి గురించి చర్చించనున్నారు.

నేషనల్ స్కూల్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి-విజయనగరం




సాధించిన పతకాలతో విద్యార్థులు

నగరంలోని నేషనల్ స్కూలు విద్యార్థులు ఇటీవల న్యూ ఢిల్లీ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ లో 5 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గోల్డు మెడల్ సాధించిన వారిలో బొడ్డు మోజేష్ విశాల్, బి.చిరాగ్‌వర్థన్, ఆర్.విజయ్ కుమార్, బి.దీక్షిత ప్రియ, కె.డమరాంజని ఉన్నారు. సిల్వర్ మెడల్స్ సాధించిన వారిలో ఎస్.ఇప్సిత, ఎంఎంవి హాసన్, బి.సాయి ప్రణతి, బ్రాంజ్ మెడల్స్ సాధించిన వారిలో వై. భరత్, కె.తాన్విశ్రీ, ఎన్ఎన్ ధనుష్ ఉన్నారు. వీరందరినీ స్కూలు కరస్పాండెంట్ బి.రామారావు, ఇన్‌ఛార్జి దీపిక్, ఉపాధ్యాయులు అభినందించారు.

సిఎంఎ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ రమేష్

సిఎంఎ ఇంటర్ ఫలితాల్లో అర్ ఎస్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జనవరిలో జరిగిన పరీక్ష రాసిన విద్యార్థులు 66 శాతం మంది ఉత్తీర్ణత సాధించి మెరుగైన ఫలితాలు సాధించారు. సి హెచ్ సాహితీ, పి.సాయి సందీప్, పి.శరత్ చంద్ర, పి.రత్న వినీక్య, సిహెచ్ అభిలాష, కె.నీలిమ, ఎస్ శ్రావ్య, డి.ఉషగ్న, కె భావన, జి.భార్గవ్, కె లావణ్య మంచి మార్కులు సాధించారు. వీరందరినీ అర్ ఎస్ అకాడమీ (సిఎ) డైరెక్టర్ ఎ.రమేష్ అభినందించారు.

క్షయ నియంత్రణలో ప్రజా భాగస్వామ్యం

క్షయపై అవగాహన ర్యాలీలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

క్షయ వ్యాధి నియంత్రణలో ప్రజా భాగస్వామ్యం అవసరమని, అవగాహన ఏర్పరచుకోవటం ద్వారా సంపూర్ణంగా నియంత్రించవచ్చని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. రెండు వారాలకు మించి దగ్గు వస్తే తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సం సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి చేపట్టిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్షయ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యాధి లక్షణాలపై అవగాహన పెంచుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సూచనలు పాటించాలని, తగిన మోతాదులో మందులు తీసుకోవాలని హితవు పలికారు. రోగులకు ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందుతాయని తెలిపారు. కొంతమంది దాతల సహకారంతో క్షయ వ్యాధి బారిన పడిన రోగులకు ఆహారం అందిస్తున్నామని, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామని మిగిలిన దాతలు కూడా ముందుకు వచ్చి వారికి తోచినంత సహాయం చేయాలని కలెక్టర్ సూర్యకుమారి విజ్ఞప్తి చేశారు.

ర్యాలీలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్‌వి. రమణ కుమారి, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విభాగం అధికారి రామేశ్వరి ప్రభు, జిల్లా సమన్వయ అధికారి(టీబీ కంట్రోల్) కుమార్, ఇతర వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఒఎన్ఎంలు, ఆశాలు, వివిధ కళాశాలల నిర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

టిబిని అంతం చేయడమే లక్ష్యం

టిబిని అంతం చేయడమే లక్ష్యమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూసపాటిరేగ : రాను రాను టీబీ ఓడిపోతుందని దేశం గెలుస్తుందని పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజేష్ వర్మ, ప్రమీలా దేవి అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం స్థానిక పిహెచ్‌సిలో జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఆర్‌వి రమణ, గాడి బంగారుబాబు, గణపతి పాల్గొన్నారు.

రేగిడి : మండలంలోని బూరాడ పిహెచ్‌సి వైద్యాధికారి జి.భార్గవి ఆధ్వర్యంలో శుక్రవారం క్షయ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వేపాడ : వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి ఆధ్వర్యంలో క్షయపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : నారాయణప్పవలస ప్రాథమిక పాఠశాలలో రోటరీ అధ్యక్షులు జె.సి.రాజు ఆధ్వర్యాన క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, రామచంద్ర రావు, మహేష్ పాల్గొన్నారు.



వేపాడ.. ప్లకార్డులతో ప్రదర్శన చేపడుతున్న వైద్య సిబ్బంది, వైద్యులు


రేగిడి.. ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, వైద్యులు

భూగర్భ జలాలే కీలకం

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్


డెంకాడ.. ఎంవిజిఆర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్

ప్రజాశక్తి-డెంకాడ

చిన్న రిజర్వాయర్లు, నదీ వ్యవస్థపై మన జిల్లా ఆధార పడి ఉందని, అందుకే భూగర్భ జలాలే ఎంతో కీలకమని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్ తెలిపారు. ఎంవిజిఆర్ కళాశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 నాటికి అన్ని నివాసాలకు నిరంతరం తాగునీటి సరఫరాతో కుళాయి కనెక్షన్‌ను అందించే మిషన్‌ను గుర్తు చేశారు. భూగర్భ జలాల లభ్యతను పెంపొందించేందుకు పరిరక్షణ పద్ధతులు, రీఛార్జ్ మెలకువలను అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉద్బోధించారు. వ్యవసాయశాఖ శ్రీకాకుళం జిల్లా ఎఫ్‌టిసి డిప్యూటీ డైరెక్టర్ కె.త్రినాథస్వామి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న మంచినీటి వనరుల వినియోగాన్ని వివరించారు. అనంతరం ఎంవిజిఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎల్ రాజు ఆధ్వర్యాన నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ముందుగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.రంగరాజు, ఎన్ఎస్ఎస్ పిఒ ఎన్.షణ్ముఖరావు, సివిల్ హెచ్ఒడి పి.మార్కండేయరాజు, సీనియర్ ఫ్యాకల్టీ ఎస్.చంద్రమౌళి, డిపార్ట్మెంట్ టిఅండ్ పి ఇన్‌ఛార్జి సిహెచ్‌వి రవిశంకర్ పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని ఎంపిపి శంబంగి లక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకుడు గుంతలను తయారు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను వృద్ధి చేయొచ్చని పేర్కొన్నారు.

నాటుకోళ్లు పంపిణీ

నాటుకోళ్ల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. వైకెపి కార్యాలయంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు లబ్ధిదారులకు నాటుకోళ్ల పంపిణీ చేశారు. అనంతరం ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు పాల్గొన్నారు.

వైసిపిపై పెరుగుతున్న అసంతృప్తి

టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ అసంతృప్తి పెరుగుతోందని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపికి పూర్వ వైభవం వస్తుందనడానికి పంచుమర్తి అనురాధ విజయమే నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న రాక్షస పాలనను అంతమొందించడానికి రోజులు దగ్గర పడ్డాయని చెప్పారు. ఎప్పటికైనా విజన్ కలిగిన చంద్రబాబు నాయుడు రామబాణానికి వైసిపి గురికాక తప్పదన్నారు. అందుకు ఉదాహరణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికేనని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే పునరావృతమవుతుందని తెలిపారు.

ఎండియు ఆపరేటర్ల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎండియు ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందించారు. అనంతరం ఎండియు ఆపరేటర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల వెంకటరమణ మాట్లాడుతూ ఎండియు వాహనాలకు ఇన్సూరెన్స్ కోసం వేతనాల్లో కోత పెడుతున్నారని, తక్షణమే ఆ డబ్బులు ఆపరేటర్ల ఖాతాలో జమ చేయాలని కోరారు. బీమా సౌకర్యం కల్పించి, అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దాడి రాంబాబు, వెలుచూరి కృష్ణ, డి.రాజేష్, కె.కుమార్, ఎం.కనకరాజు, రమేష్, శంకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5.76 లక్షలకు రోజువారీ మార్కెట్

ప్రజాశక్తి - జామి

2023 -24 ఆర్థిక సంవత్సరానికి జామి మేజర్ పంచాయతీలో కూరగాయల మార్కెట్ ఆశీల వసూళ్లకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఇఒపిఆర్‌డి వై.లక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచ్ సిహెచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ, ఇఒ ఎం.శ్రీదేవి సమక్షంలో వేలం వేశారు. ఇందులో 42 మంది పాటదారులు పాల్గొన్నారు. బొబ్బిలి రాజు యాదవ్ రోజువారి ఆశీలు, వారపు సంత ఆశీలను సొంతం చేసుకున్నాడు. రోజువారి ఆశీలు వసూలుకు రూ.4.95 లక్షలు, వారపు సంతకు రూ. 81 వేలకు ఖరారయ్యాయి. మొత్తం 5.76 లక్షలకు ఆశీల వేలం ఖరారైనట్లు ఇఒ శ్రీదేవి వివరించారు.

తాగునీటి సమస్యలపై క్రాష్‌ప్రోగ్రాం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంని స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రక్షిత తాగునీటి పథకాలు, బోర్లు మరమ్మతులకు గురైతే వాటిని తక్షణమే బాగు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీల వారీగా మే తొమ్మిదో తేది వరకు ఈ వాహనం పర్యటిస్తుందన్నారు. గ్రామాలలో నీటి సమస్యలపై ఫిర్యాదు చేయాలనుకుంటే 9100120711 నంబర్‌కు చెప్పొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రూపేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చంద్రకళ, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ దొర, ఎల్.కోట మాజీ సర్పంచ్ జామి రాజు తదితరులు పాల్గొన్నారు.

61 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-కొత్తవలస

వీరభద్రపురం పంచాయతీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొన్నట్లు ఎస్ఐ బి.దేవి తెలిపారు. కాలి సంతోషిని అరెస్టు చేసి, 61 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పిహెచ్‌సి అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-వంగర

స్థానిక పిహెచ్‌సి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ తెలిపారు. పిహెచ్ ఆవరణలో అభివృద్ధి కమిటీ మొదటి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం 1.70 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. చైర్మన్‌గా సురేష్ ముఖర్జీ, కన్వీనర్‌గా డాక్టర్ సుస్మిత దయానా, కమిటీ సభ్యులుగా తహశీల్దార్, ఎంపిడిఒ, స్థానిక సర్పంచ్‌ను ప్రభుత్వం నియమించినట్లు సమావేశంలో ప్రకటించారు. సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ డి.ఐజాక్, ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కెజెపూడి పంచాయతీలోని కోటయ్య గరువు, బడ్డీచింతల గిరిజన గ్రామాల్లో బొద్దాం పిహెచ్‌సి వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాలలో 80 మందికి పరీక్షలు చేశారు. అందులో ఐదుగురిని జ్వరపీడితులుగా గుర్తించి, మందులు అందించారు. అనంతరం క్షయవ్యాధిపై గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సతీష్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ పిఎస్‌ఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ నేర్చుకో.. జీవితాన్ని మార్చుకో

'సీతం'లో స్పోకెన్ ఇంగ్లీష్‌పై రెండు రోజుల శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

ఇంగ్లీష్ నేర్చుకోవడం ద్వారా జీవితాన్ని మార్చుకోవచ్చని ప్రముఖ స్పోకెన్ ఇంగ్లీష్ ఎక్స్‌పర్ట్ విశాఖపట్నంకు చెందిన విద్యా స్పోకెన్ ఇంగ్లీష్ సాఫ్ట్ స్కిల్స్ డైరెక్టర్ కురిటి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సీతం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నైపుణ్యాలలో తర్ఫీదునిస్తూ రెండు రోజుల శిక్షణను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల భాష ప్రావీణ్యం జీవన స్థాయిని మెరుగుపరుస్తుందని, ఆత్మవిశ్వాసం తో పాటు అత్యుత్తమ ఉపాధి అవకాశాలను అందిస్తుందని అన్నారు. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకునే పద్ధతులను వివరించారు. సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ సీతంలో ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే కమ్యూనికేట్ ఇంగ్లీష్ తో పాటు కార్పొరేట్ నైపుణ్యాలను అందిస్తున్నామన్నారు. లైఫ్ స్కిల్స్ కోచ్ జెట్టీ దొంతల మాట్లాడుతూ నూతన నైపుణ్యాలను, ఇంగ్లీషు వంటి అవసరమైన భాషను నేర్చుకునేటప్పుడు అనేక అనుమానాలు సహజంగా ఎదురవుతాయని, అయినప్పటికీ నిరంతర సాధన ద్వారా కాలానికి అను గుణంగా తనని తాను మార్చుకోవాలని అన్నారు. ప్రత్యేకించి గ్లోబల్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ నేర్చుకోవడం వ్యక్తిగత అభివద్ధికి ఎంతో కీలకమని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డివి రామ్మూర్తి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు నాగరాణి, సతీష్ ,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భవిష్యత్తు ఇ-వాహనాలదే

సెంచూరియన్ విసి జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాబోయే తరంలో ఇ-వాహనాలపైనే ఆధార పడాల్సి వస్తుందని సెంచూరియన్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్స్ డిజైన్ అండ్ అసెంబ్లీ అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయం ఎలక్ట్రిక్ వాహనాలేనని చెప్పారు. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సాంబశివరావు మాట్లాడుతూ సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలన్నారు. రోజుకు 16 గంటలు పనిచేసేతత్వం అలవర్చుకోవాలన్నారు. సీతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణ రావు మాట్లాడుతూ శిలాజ ఇంధనం వినియోగించే వాహనాలకు చరమదశ వచ్చిందన్నారు. అనంతరం అధితమ్ మెమోరియల్ స్కాలర్ షిప్‌ను కె.లావణ్యకు అందజేశారు. కార్యక్రమంలో కుమార్ రాజా, రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్.ఎస్.వర్మ, కెవిజి కృష్ణమూర్తి, అసోసియేట్ డీన్ సన్నీడియోల్, మెకానికల్ విభాగాధిపతి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ అమ్మకాలు చేపట్టవద్దని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మొయిద జంక్షన్ షాపుల్లో దాడులు నిర్వహించారు. షాపుల నుంచి ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం

ప్రజాశక్తి-మెరకముడిదాం

భూముల రీసర్వేను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ ఎం.అప్పారావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బైరిపురంలో చేపడుతున్న రీసర్వేను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు పూటలా సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పప్పల గ్రహణేశ్వరరావు, ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కె.ధనంజయ, సర్వేయర్ జానకిరామ్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం

ప్రజాశక్తి-రేగిడి

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని సర్పంచ్ చంద్రశేఖర్‌రావు, ఎన్ఎస్ఎస్ పిఒ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మునకలవలసలో జిఎంఆర్ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన సేవా శిబిరాన్ని ప్రారంభించారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు కోరారు. విద్యార్థులకు సహకారాన్ని అందించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎస్.తవిటినాయుడు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ బాబు, శాసపు నారాయణరావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ లావాటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్లు పంపిణీ

ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక వైకెపి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎపిఎం దేముడుబాబు అధ్యక్షతన డ్వాక్రా మహిళలకు 30 యూనిట్ల పెరటి కోళ్లను అందజేశారు. ఒక యూనిట్‌కు 11 కోడి పిల్లలను, 8 పెట్టలను, 3 పుంజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ 50 శాతం రాయితీపై లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కోళ్లు నాటుకోడి, గిరిరాజా కోడి క్రాసింగ్ ద్వారా ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్ నాయుడు, పి.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

300 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో అకాల వర్షాలకు 300 ఎకరాల్లో మొక్క జొన్న పంట నష్టం వాటిల్లిందని ఎఒ ఎం.పూర్ణిమ తెలిపారు. శుక్రవారం ఆమె సతివాడ, గుశిని, అలుగోలు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. పంట పొలాలు పరిశీలించి 33 శాతం కన్నా ఎక్కువ నష్టం వాటిల్లిన పంటల వారీగా రైతుల జాబితాలు తయారు చేయాలని వివిఎలను సూచించారు.

గిరిజన గ్రామాల్లో వెలుగులు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని చిన్నజక్కివలస.. మారుమూల గిరిజన గ్రామం. ఈ గ్రామాన్ని ఐటీసీ బొబ్బిలి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ సందర్శించింది. గిరిజన కష్టాలను యువత స్వయంగా తెలుసుకుంది. ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు పడుతున్న అవస్థలు విని ఆ యూత్ సభ్యులు చలించిపోయారు. ఎలాగైనా గిరిజన గ్రామంలో వెలుగులు నింపాలని నిర్ణయించారు. తలో చేయి వేసి రూ.30 వేలు పోగుచేశారు. అక్కడ నివసిస్తున్న గిరిజనుల ఇళ్లకోసం వీధిలో సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో బొబ్బిలి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ సభ్యులు పితాని శ్రీను, ప్రశాంత్, కుమార్, నరసింహమూర్తి, సందీప్, నాగార్జున, సంతోష్ ,నాయుడు, మురళి, రమేష్, మణి, తదితరులకు గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎట్టకేలకు కన్నెంగెడ్డ పూడికతీత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కన్నెంగెడ్డ పూడికతీత పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని దేవి జంక్షన్ సమీపంలో ఉన్న కన్నెంగెడ్డలో పూడికతీత పనులను సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఉప సర్పంచ్ మోపాడ కుమార్, ఇఒ పాత్రో, వార్డు మెంబర్ మజ్జి శేఖర్, శానిటరీ మేస్త్రి నానిగిరి కృష్ణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోషికుమారి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైనా పారిశుధ్య సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పూడికతీత పనులు మరికొద్ది రోజులు కొనసాగుతాయని ఆమె తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

ప్రజాశక్తి-వంగర

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు తలగాం సచివాలయంలో ఆయన శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడుతూ సచివాలయంలో అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

'ప్రజ్ఞా వికాస్' విజేతలకు పురస్కారాలు

ప్రజాశక్తి-గంట్యాడ

ఇటీవల ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పోటీ పరీక్షల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. మండలంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సోమేష్ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని జమ్ముపేటలో ఎల్ఓటిసిలో శుక్రవారం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గుర్ల, దత్తిరాజేరు మండలాల్లోని రెండు పంచాయతీల సర్పంచులు, వైస్ సర్పంచులు, పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రలకు పారిశుధ్య నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జమ్ముపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని అభినందించారు. జిల్లాలో ప్రతీ గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పి సిఇఒ అశోక్ కుమార్, డిపిఒ నిర్మలాదేవి, వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, జెడ్పిటిసి శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, సర్పంచ్ వరలక్ష్మి వైస్ ఎంపిపి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా అంతటా విశ్రాంతి భవనాలు నిర్మించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో విశ్రాంతిభవనాలు (షెడ్ లు) లేక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వాహనాలు రాక కోసం ఎండలో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు పదోతరగతి ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి, రేగిడి, లక్ష్మిపురం, అంబాడ వెంకటపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వాటిని ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు రూట్ అధికారి ఎంఇఒ ప్రసాదరావు అందజేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్టేషన్లో భద్రపరిచారు. వీరితోపాటు హెచ్‌ఎంలు మరడాన రామినాయుడు , ఎస్.రాజ్యలక్ష్మి మురళీకృష్ణ ఉన్నారు.

కోటలో విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పి.అనురాధ విజయం సాధించడంతో బొబ్బిలి కోటలో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సీమంతాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సర్పంచ్ కర్రి యశోద ఆధ్వర్యాన ఎంపిటిసి గొంప తులసి.. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మహేశ్వరి మాట్లాడుతూ పౌష్టికాహార ప్రాధాన్యత, ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టిక కిట్ల గురించి వివరించారు.

తుమ్మికాపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో శుక్రవారం మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.సాయిశ్రుతిరెడ్డి ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించారు. గ్రామంలోని 75 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పిల్లలతో ముచ్చటించి వారికి ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఊడికలపేటలో 'చేయి చేయి కలుపుదాం'

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని ఊడికలపేట గ్రామంలో డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ ఆధ్వర్యాన శుక్రవారం చేయి చేయి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం.. కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తెలుగు సూరిబాబు, గోపి, అప్పల రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

20 పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగరాయపురం గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 20 పశువులకు చూలు తనిఖీలను పశువైద్యాధికారి కొరాద గాయత్రి చేశారు. ఇదే సమయంలో ఉత్తర్వ పద్ధతి పశుగ్రాస పంపక ప్రాముఖ్యత, వేసవి కాలంలో పశుపోషణ వంటి అంశాలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు.

శివాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గరివిడి

మండలంలోని మందిరవలస గ్రామంలో శివాలయానికి శుక్రవారం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎంపిపి మీసాల విజయలక్ష్మి కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పిటిసి వాకాడ శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ గోపి, సర్పంచ్ కొరాడ రామారావు, పి.వెంకటరావు, పి.రమేష్, పి.గవరయ్య, సూర్యారావు, గడబలవస సర్పంచ్ యల్లంటి సత్యనారాయణ, ఎంపిటిసి పోలీస్ పాల్గొన్నారు.